క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మిస్తున్న పాటిమీద ఆంజనేయస్వామి ఆలయానికి వ్యాపార ప్రముఖుడు గుడిమెట్ల చిన్న వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతల సహకారంతో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు చేపట్టిన నిర్మాణ పనులకు తనవంతుగా ఈ సొమ్ము అందజేశామని వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, నాళ్లా ఆంజనేయులు, కంచి చిన్న అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ

ఇబ్రహీంపట్నం: క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు 750 కిలోల బియ్యం, రూ.11 వేల నగదును ఆదివారం పంపిణీ చేశారు. చర్చి పెద్దలు విజయరావు, సువర్ణప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురైన పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తమకు తోచిన సహాయం చేసి ఆదరించాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సత్యనారాయణ, రాఘవులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



నూజివీడు: విద్యార్థులు ఖాళీ సమయాల్లో గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేయడం ద్వారా ఎన్నో తెలియని విషయాలను తెలుసుకోవచ్చని ఉపాధ్యాయులు ఎస్.వేణుగోపాలరావు అన్నారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఆదివారం పుస్తక పఠనం చేయడంతో పాటు చదివిన పుస్తకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పుస్తకాలు, కథల పుస్తకాలు, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తెలిపే పుస్తకాలు, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగిన గొప్ప వ్యక్తుల పుస్తకాలు తదితర ఎన్నో పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. శిబిరంలో విద్యార్థులతో కథలు చెప్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



నూజివీడు: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని స్నేహ రైడ్స్ అధినేత బసవరాజు నగేష్ అన్నారు. ప్రపంచ క్యాండిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారికి ఆదివారం సాయంత్రం శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులను ప్రజలు చిన్నచూపు చూడటం వల్ల వారు మరింత మానసిక క్షోభకు గురవుతారని చెప్పారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మే నెల మూడో ఆదివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి క్యాండిల్స్ వెలిగించి మరణించిన ఎయిడ్స్ రోగులకు మౌనం పాటించారు. కార్యక్రమంలో స్నేహ రైడ్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి రజత కవచాలు సమర్పణ



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహునికి ఆదివారం భక్తులు రజత కవచాలను సమర్పించారు. ఆగిరిపల్లికి చెందిన మడుపల్లి అశోక్ దంపతులు రూ. 4 లక్షల విలువగల వెండి కవచాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌కు అందజేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, శాంతి కల్యాణం, మూల మంత్ర హోమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగాలను అర్చకులు వేదాంతం శేషబాబు, అనంతకృష్ణ ఆధ్వర్యంలో జరిపించారు. ఉభయ దాతలుగా మడుపల్లి అశోక్ దంపతులు వ్యవహరించారు.

గృహయోగం

- పేదల సొంతింటి కల సాకారం
- నియోజకవర్గంలో 3,742 గృహాల నిర్మాణం పూర్తి
- ఇప్పటివరకు రూ.98.50 కోట్ల వ్యయం





నూజివీడు పట్టణంలోని అన్నవరం వద్ద జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలు: ట్రిపుల్ ఐటీ ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలు

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలోని పేదల సొంతింటి కల సాకారమవుతోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలో నివసిస్తున్న పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో పక్కా గృహాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలు తమ కల నెరవేరుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 113 లే అవుట్‌లలో ప్రభుత్వం 6,645 గృహాలను, సొంత స్థలాలు ఉన్న వారికి 4,961 గృహాలను మంజూరు చేసింది. ఇదివరకెన్నడూ ఎక్కడా లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా ఆ కలను సాకారం చేస్తుండటంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి. పక్కా గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఎప్పటికప్పుడే బిల్లులు మంజూరు చేస్తూ గృహాల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటోంది.

అవినీతి, సిఫార్సులు లేకుండానే ఇళ్లు..

దరఖాస్తు చేసుకున్న అతి తక్కువ రోజుల్లోనే, పైసా అవినీతికి ఆస్కారం లేకుండా, ఎవరి సిఫారసులు అవసరం లేకుండా అర్హతే ప్రమాణికంగా ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అందజేయడమే కాకుండా ఇళ్లను సైతం మంజూరు చేసింది. దీంతో పేదలు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తాము కొంత మొత్తాన్ని కలుపుకుని గృహాలను నిర్మించుకుంటున్నారు. దీనికి తోడు స్వయం సహాయక సంఘాల మహిళలకు గృహ నిర్మాణం కోసం తక్కువ వడ్డీకి రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలను సైతం ప్రభుత్వం బ్యాంకర్లతో మాట్లాడి మంజూరు చేయించింది. గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంతాల్లో సెంటు స్థలాన్ని ప్రభుత్వం పేదలకు అందజేసింది. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులు సైతం ఎప్పటికప్పుడు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.

తక్కువ ధరకే సిమెంట్, స్టీల్..

జగనన్న లే అవుట్‌లలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. ఐఎస్ఐ మార్కు ఉన్న నాణ్యమైన సిమెంట్, స్టీల్, ఇతర వస్తువులను మార్కెట్ ధరల కంటే తక్కువకే అందిస్తోంది. ఇసుకను మార్కెట్ యార్డులో స్టాకు పాయింట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఉచితంగా అందిస్తోంది. అలాగే స్థోమత లేని వారికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ల నుంచి లబ్ధిదారులకు పావలా వడ్డీకే ప్రభుత్వం రుణాలు అందిస్తోంది.

నియోజకవర్గంలో 11,606 గృహాలు మంజూరు..

నియోజకవర్గంలోని నూజివీడు పట్టణంతో పాటు, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో కలిపి లేఅవుట్‌లు, సొంత స్థలాల్లో కలిపి 11,606 గృహాలు మంజూరు కాగా, వీటిలో ఇప్పటివరకు 924 గృహాలు మాత్రమే ఇంకా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన గృహాల నిర్మాణం ప్రారంభమై పలు దశల్లో ఉన్నాయి. 3,742 గృహాలు నిర్మాణాన్ని సైతం పూర్తి చేసుకున్నాయి. 10,682 గృహాలు గ్రౌండ్ కాగా, వీటిలో బీబీఎల్ దశలో 3,267, బేస్‌మెంట్ లెవెల్‌లో 2,377, స్లాబ్ దశలో 716, స్లాబ్ పూర్తయినవి 580 గృహాలు ఉన్నాయి. లేఅవుట్‌లలో నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం నీటి వసతిని కల్పించింది. ప్రతి లే అవుట్‌లో విద్యుత్ సదుపాయంతో పాటు బోర్లు వేసి నీటి ట్యాంకులు ఏర్పాటు చేయడంతో నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా ఉంది. ఇప్పటివరకు గృహ నిర్మాణాలకు గాను నియోజకవర్గంలో రూ.98.50 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ కనెక్షన్‌ను సైతం మంజూరు చేస్తోంది.

నూజివీడు నియోజకవర్గంలో నిర్మిస్తున్న గృహాల వివరాలు

మండలం	మంజూరైన గృహాలు	ప్రారంభం కానివి	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్న గృహాలు
నూజివీడు	3,613	156	1,488	1,969
నూజివీడు(ప)	3,442	115	669	2,658
ముసునూరు	988	323	304	361
చాట్రాయి	1,121	269	241	611
ఆగిరిపల్లి	2,442	61	1,040	1,341
మొత్తం	11,606	924	3,742	6,940

పంటల దిగుబడికి విత్తనాల ఎంపిక కీలకం

ముసునూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందస్తుగా ప్రారంభం కానున్న దశలో వరి, పత్తి విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలని వ్యవసాయ శాఖాధికారి సందిపాము మధుమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను ఎంపిక చేసుకుంటే, పంట దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. రైతులను మోసగిస్తూ నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు చేపట్టి, కేసులు నమోదు చేస్తామని విత్తన దుకాణదారులను హెచ్చరించారు. రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలు విషయంలో జాగ్రత్త వహించాలని, మందులు, విత్తనాల కొనుగోలుకు సంబంధించి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు.

పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలి

ముసునూరు: పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు నూరు శాతం వినియోగించి భూ సారాన్ని పెంచాలని వ్యవసాయ శాఖాధికారి సందిపాము మధుమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పచ్చిరొట్ట ఎరువులను పెంచడానికి వీలుగా జీలుగ 160 క్వింటాళ్లు, జనుము 100 క్వింటాళ్లు, పిల్లిపెసర 70 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. తక్కువ సారవంతమైన పొలాల్లో ఎక్కువ సారాన్ని పెంచడానికి ఉపకరించే జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను రైతులందరూ 50 శాతం రాయితీతో ప్రతి గ్రామంలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా పొందవచ్చని చెప్పారు. రైతులకు సమగ్ర అవగాహన కల్పించి ఈ ఏడాది పచ్చిరొట్ట ఎరువుల వినియోగం అధికంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

ఆదర్శప్రాయుడు సుందరయ్య



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న నాగేశ్వరరెడ్డి

తిరువూరు: పేదలకు సామాజిక న్యాయం అందించడంలో కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శంగా నిలిచారని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి సానికొమ్ము నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో పుచ్చలపల్లి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సుందరయ్య సామాజిక అసమానతలను పోగొట్టడానికి తన వాటాగా వచ్చిన వంద ఎకరాలను పేదలకు పంపిణీ చేసిన మహనీయుడని చెప్పారు. అంటరానితనం, కులవివక్ష, రైతు, కూలి భేదాల తొలగింపునకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. సుందరయ్యను నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీ అనుబంధ సంఘాల నాయకులు నాగేంద్రప్రసాద్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

- **రెడ్డిగూడెం:** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సీపీఎం రెడ్డిగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి మాట్లాడుతూ సుందరయ్య ప్రజాశ్రేయస్సు కోసం నిరంతరం ఉద్యమించారన్నారు. సుందరయ్య సేవలను కొనియాడారు. సీపీఎం మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, అప్పిరెడ్డి, బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.
- **మైలవరం:** మైలవరం సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, సీపీఎం మండల నాయకులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ సుందరయ్య ఆదర్శ పార్లమెంటేరియన్ అని చెప్పారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఆయన చేసిన ఉద్యమాలను పలువురు వివరించారు. సీపీఎం మండల కార్యదర్శి వి నాగరాజు, పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, నాయకులు ఆకుల శ్రీనివాసరావు, ఏడుకొండలు, చిట్టిబాబు పాల్గొన్నారు.
- **ఎ.కొండూరు:** చీమలపాడు గ్రామంలో సుందరయ్య చిత్ర పటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పి. అనందరావు, పి. వెంకటేశ్వరరావు, ఎస్. సోములు, మరియమ్మ, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.
- **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సీపీఎం కొండపల్లి కార్యదర్శి ఎం.మహేష్ నేతృత్వంలో పలువురు నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీ, ఎమ్మెల్యేగా పార్లమెంట్, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రజానేత సుందరయ్య అన్నారు. సుందరయ్య సేవలను కొనియాడారు. నాయకులు వెనిగళ్ల మురళీమోహన్, చింతాడ శివ తదితరులు పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం ఆగిరిపల్లిలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు, నాయకులు సత్తు కోటేశ్వరరావు, జలసూత్రం గోపాలరావు, శామ్యూల్ పాల్గొన్నారు.

చదరంగం, క్యారంబోర్డుల వితరణ



తిరువూరు గ్రంథాలయానికి చదరంగం, క్యారంబోర్డుల వితరణ

తిరువూరు: విద్యార్థులు చదువుతో పాటు ప్రతి రోజూ కొద్ది సమయం క్రీడలకు సమయం కేటాయించాలని తిరువూరు శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చదరంగం, క్యారంబోర్డులను విరాళంగా అందజేశారు. గ్రంథాలయంలో పుస్తకాలతో పాటు బాలబాలికలు ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు అవసరమైన పరికరాలను కూడా ఏర్పాటు చేస్తామని పద్మావతి చెప్పారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, నృత్యంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు భరతకుమారి వేమన పద్యాలను నేర్పించారు.

సోషల్ మీడియాపై ఖాకీ కన్ను

వివాదాస్పద పోస్టులు షేర్ చేస్తే కఠిన చర్యలు



నందిగామ: రాష్ట్రంలో ఎన్నికల తర్వాత పలుచోట్ల అల్లర్లు జరిగిన నేపథ్యంలో పోలీసులు సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టారు. నానాటికి పెరుగుతున్న సోషల్ మీడియా ప్రభావంతో వివాదాలు చెలరేగే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆయా ప్రాంతాలలోని సోషల్ మీడియా గ్రూపులపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా ఇటీవల సోషల్ మీడియా వేదికగా అనేకమంది మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోల ద్వారా సందేశాలను ఫార్వర్డ్ చేస్తున్నారు. వాళ్లు ఫార్వర్డ్ చేస్తున్న మెసేజ్, వీడియోలు వాస్తవమా, కాదా అనేది కూడా కనీసం ఆలోచించడం లేదు. ఒక్కో సందర్భంలో ఫేక్ మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయడం వల్ల తెలియకుండానే వివాదాలు చోటుచేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల ఎన్నికల సందర్భంలో పలుచోట్ల అల్లర్లు జరిగిన నేపథ్యంలో సోషల్ మీడియానే ఎక్కువ ప్రభావం చూపిందని నమ్మిన అధికారులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి పెట్టారు.

నందిగామలోనూ..

ప్రతి మండల పరిధిలోనూ సోషల్ మీడియా గ్రూపులు, సోషల్ మీడియాలో ఎక్కువ చురుకుగా ఉండేవాళ్లు, తరచూ వివాదాస్పద పోస్టింగ్‌లు పెట్టే వాళ్లపై పోలీసులు ఓ కన్నేశారు. ప్రతి గ్రూపులోను వస్తున్న మెసేజ్‌లను పరిశీలించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. సంబంధిత గ్రూపుల్లో ఏమైనా వివాదాస్పద మెసేజ్‌లు, వీడియోలు, ఫొటోలను ఎవరైనా పోస్ట్ చేస్తే వెంటనే వారిని గుర్తించే విధంగా నిఘా ఏర్పాటు చేశారు.

అనవసరంగా షేర్ చేయొద్దు..

దీనిపై నందిగామ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్‌ను వివరణ కోరగా ముందు జాగ్రత్తగా సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎవరైనా వివాదాస్పద మెసేజ్‌లు, వీడియోలు, ఫొటోలు అనవసరంగా గ్రూపులలో పోస్ట్ చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వాళ్లని గుర్తించి అటువంటి వారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు.

బాటిళ్లలో పెట్రోలు విక్రయిస్తే చర్యలు



కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ బంక్ యజమానులతో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్



నందిగామ పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో ఏర్పాటు చేసిన బోర్డు

కంచికచర్ల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు బాటిళ్లలో లూజ్ పెట్రోలు పోయరాదని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పి. చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పెట్రోలు బంక్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్‌ను ప్లాస్టిక్ బాటిళ్లలో కాని కంటైనర్ ద్వారా కాని, ఇతర పద్ధతులలో లూజు పోయరాదన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించినట్లయితే వారిపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామన్నారు. ఒకవేళ ఎవరైనా ప్రయాణికుడి వాహనం మార్గ మధ్యంలో ఆగిపోతే బాటిళ్ల ద్వారా పెట్రోలు పోయకుండా బంక్ సిబ్బందిని పంపించి వాహనదారుడికి సహకరించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు బాటిళ్లలో కాని కంటైనర్ లేదా ఇతర పద్ధతులలో లూజు పెట్రోలు పోయరాదని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ–2 హైమావతి, పెట్రోలు బంక్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాటిల్లో పెట్రోల్ ఇవ్వం..

నందిగామ: ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పలుచోట్ల జరిగిన వివాదాల నేపథ్యంలో అధికారులు పెట్రోల్ బంకుల యజమానులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పెట్రోల్ బంకులలో కేవలం వాహనాలకు మాత్రమే పెట్రోల్, డీజిల్ కొట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నందిగామ పట్టణంలోని పలు పెట్రోల్ బంకులలో బాటిల్స్, డబ్బాలలో పెట్రోల్ కొట్టబడదు అంటూ సంబంధిత బంకులో యజమానులు ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు.

నేరాలకు పాల్పడితే సహించం

తిరువూరు సీఐ అబ్దుల్ నబీ హెచ్చరిక

తిరువూరు: అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం పాత నేరస్తులకు, రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ అనవసర వివాదాల్లో తలదూర్చడం, ఓట్ల లెక్కింపు సందర్భంగా బెట్టింగులు వంటి చర్యలకు పాల్పడటం, పార్టీ వివాదాలకు దిగే వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉందని, శాంతియుత వాతావరణానికి సహకరించాలన్నారు. సర్కిల్ పరిధిలోని సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


నాలుగో దశ క్యాన్సర్‌కు అరుదైన చికిత్స



డాక్టర్ సాయికృష్ణ, మెడికల్ ఆంకాలజిస్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫోలిక్యులర్ లింఫోమా నాలుగో స్టేజ్‌లో ఉన్న రోగికి విజయవంతంగా చికిత్స అందించామని అమెరికన్ ఆంకాలజీ వైద్యుడు, ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు ఆదివారం తెలిపారు. నగరానికి చెందిన 62 ఏళ్ల వ్యక్తి ఆరు నెలలుగా బరువు తగ్గడం, తీవ్రమైన వెన్నునొప్పి వంటి సమస్యలతో పలు ఆస్పత్రులకు వెళ్లగా క్షయ వ్యాధిగా భావించి చికిత్స చేశారన్నారు. అనంతరం తమ ఆస్పత్రికి రాగా సమగ్ర పరీక్షలు చేయగా పెద్ద లింఫ్‌నోడ్స్, ఎముక ప్రమేయంతో ఫోలిక్యులర్ లింఫోమా నాలుగో దశలో ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన దశలో ఉన్న ఒక రకమైన నాన్–హాడ్కిన్ లింఫోమాగా చెప్పారు. ఒక ప్రాంతంలోనే కాకుండా ఎముక మజ్జ, కాలేయం, ప్లీహం, ఊపిరితిత్తుల వంటి అవయవాలకు వ్యాపించిందన్నారు. దీంతో రోగికి అధునాతన చికిత్సా విధానాలతో ఆరు నెలల పాటు ఆరు సైకిల్స్ కీమో ఇమ్యునోథెరపీ చేశామని తెలిపారు. తాము చేసిన కీమోథెరపీకి అద్భుతమైన ప్రతి స్పందన లభించిందని చెప్పారు. దీంతో క్రమేణా లక్షణాలను నుంచి ఉపశమనం పొందారన్నారు. జీవన విధానం కూడా మెరుగుపడిందన్నారు. అధునాతన విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వలనే నాలుగో దశలో ఉన్న క్యాన్సర్‌ను నయం చేయగలిగామని డాక్టర్ సాయికృష్ణ వివరించారు.

నందిగామలో మోస్తరు వర్షం



నందిగామ మండలం కంచల ప్రాంతంలో ధాన్యం తడవకుండా పట్టా కప్పిన రైతులు

నందిగామ: నందిగామ ప్రాంతంలో గత రెండు రోజులుగా వాతావరణం మేఘావృతమై ఉంటోంది. వర్షాకాలం మాదిరిగా పగటి సమయంలో ఎండ కాసినప్పటికీ సాయంత్రం సమయానికి వాతావరణం మారిపోతోంది. ఆదివారం నందిగామ ప్రాంతంలో పగటి సమయంలో భానుడు సాధారణంగానే తన ప్రతాపాన్ని చూపాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం కురిసింది. వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో దాళ్వా సాగు చేస్తున్న రైతులు హడావుడిగా కోతలు కోసి వాటిని తడవకుండా భద్రపరుచుకుంటున్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం అలిమేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అద్దంకి సత్యనారాయణ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం స్వామి, అమ్మవార్లకు విశేషంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు మల్లెలతో అలంకరణ చేస్తామన్నారు. మంగళవారం సాయంత్రం వేద పండితులు మంత్రోచ్ఛరణలతో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత అని సెంట్రల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు డాక్టర్ మల్లు ప్రసాద్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయో వృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత వికాస్ సంఘ్వీ సహకారంతో వయో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తుండటం అభినందనీయమన్నారు. 208 నెలలుగా వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సేవలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవ చేయాలని సూచించారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

సరుకుల పంపిణీ

దాత వికాస్ సంఘ్వీ కుమారులు జైనమ్ సంఘ్వీ, ఆన్స్ సంఘ్వీ మాట్లాడుతూ తమ వద్ద పనిచేసే వి.దుర్గా భార్గవ్ జ్ఞాపకార్థం తాము వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీ తట్టి అర్జునరావు వయోవృద్ధ సేవలను వివరించారు. వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

- **చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు రత్నమాచార్యులు స్వామి వారికి అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు స్వామివారికి తులసీ దళాలను సమర్పించిన తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.